చెట్టు కొమ్మలు తొలగింపు

వారాసిగూడ నుంచి సీతాఫల్ మండికి వెళ్లే ప్రధాన రోడ్డులో చెట్టు కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

సికింద్రాబాద్, ఫిబ్రవరి 27: సీతాఫల్‌మండి నుంచి వారాసిగూడ వరకు ప్రధాన రోడ్డుకు ఇరు వైపులా ఉన్న చెట్టు కొమ్మలను అధికారులు తొలగింపజేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతుండటంతో అధికారులు స్పందించి మంగళవారం విద్యుత్ వైర్లకు అడ్డుగా ,ఏపుగా పెరిగిన చెట్టు కొమ్మలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. వేసవి కాలంలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ పీఎస్ పరిధిలోని ఓ వ్యాపారి ఇంట్లో ఆభరణాలు మాయమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రోడ్డు నంబర్4 లోని స్టోన్ వ్యాలీలో ఉంటు న్న వ్యాపారి సంయుక్త బీగాల ఇంట్లోని అల్మారాలో ఆభరణాలు పెట్టారు. 24న ఫంక్షన్ కోసం వెళ్లే సమయంలో నగల కోసం చూడగా వజ్రాల హారం, వజ్రపు చెవి రింగు లు, బంగారు గొలుసు కనిపించలేదు. మొత్తం వెతకడంతో పాటు పనిమనిషి లక్ష్మిని వాకబు చేయగా తనకు తెలియదని చెప్పింది. మంగళవారం బాధితురాలు సం యుక్త బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లో పనిమనిషి మీద అనుమానం ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

నేడు డయల్ యువర్ డీఎం

కాచిగూడ, ఫిబ్రవరి 27: ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు నేడు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం. వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు ఫోన్ నంబర్. 9000406069 కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్, ఫిబ్రవరి 27: పేద, మధ్య తరగతి ప్రజలకు చేయూతను అందించాలనే సదుద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రారంభించారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఆయన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అర్హులైన పేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్‌లు శేషుకుమారి, అరుణ శ్రీనివాస్‌గౌడ్, ఆకుల రూప తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

వెంకటేశన్ రాజుకు తలసాని పరామర్శ

బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కిమ్స్ దవాఖానలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం దవాఖానకు వెళ్లి పరామర్శించారు. వెంకటేశన్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

- బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 27

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోదాస్ కిరణ్ తండ్రి గోదాస్ యాదగిరి సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం ఉదయం ఎస్ఆర్‌నగర్‌లోని వారి నివాసంలో గోదాస్ యాదగిరి భౌతికకాయాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో కలిసి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం గోదాస్ కిరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

- అమీర్‌పేట్, ఫిబ్రవరి 27

రేపు ఎమ్ఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 27: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ఎమ్ఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం సీతాఫల్ మండి డివిజన్ నామాలగుండులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి హాజరై మాట్లాడుతూ..ఈ నెల 29న అంబర్‌పేట నియోజకవర్గంలోని రాణా ప్రతాప్ గార్డెన్స్‌లో జరిగే హైదరాబాద్ జిల్లా ఎమ్ఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల హైదరాబాద్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఉండే మాదిగలు , మాదిగ ఉపకులాలు , విద్యార్థులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శేఖర్,మంథని శామ్యూల్, తుమ్మల శివ ప్రసాద్ మాదిగ, భూపతి సుజాత మాదిగ ,సూరారం సుజాత మాదిగ, వేణుగోపాల్ మాదిగ, రాజు మాదిగ, మహేష్ మాదిగ, డప్పు మహేష్ మాదిగ, రాజేష్ ముదిరాజ్, నందరాం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అదిరేటి స్టెప్పులతో..

సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఈ ప్లే స్కూల్ మారుతీవీధి, అల్వాల్ శాఖల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగాయి. అందమైన డ్రెస్‌లు, అదిరేటి స్టెప్పులు, వావ్ అనిపించే డ్యాన్స్‌లతో సంజన ప్లే స్కూల్ చిన్నారులు అదరగొట్టారు. ఈ సందర్భంగా బుడిబుడి నడకలతో వేసే స్టెప్పులను చూసి తల్లిదండ్రులు, ప్రేక్షకులు మైమరచిపోయారు. ఆట పాటలతో పాటు ఆధ్యాత్మిక నాటికలు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విజయ్ కుమార్, ప్రిన్సిపాల్ శారద తదితరులు పాల్గొన్నారు. *- మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 27*

ఎమ్మెల్యే పద్మా రావుగౌడ్‌కు ఆహ్వానం

సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మా రావుగౌడ్‌ను టకారాబస్తీలోని ఆయన నివాసంలో మంగళవారం బీదల బస్తీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. అనంతరం మార్చి 3న సీతాఫల్‌మండి మేడిబావిలో జరిగే వివాహానికి రావాలంటూ పెండ్లి పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, మల్లేష్, వినోద్,ఆనంద్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- సికింద్రాబాద్, ఫిబ్రవరి 27

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నేటి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్‌లోని ఓ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్న కళాశాల ఉపాధ్యాయులు

మల్లయోధుడికి సన్మానం

గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఈ నెల 21న జరిగిన కుస్తీ పోటీల్లో 86 కేజీల విభాగంలో బల్కంపేట బస్తీకి చెందిన విజయ్‌కుమార్ సత్తా చాటి శివాజీ కేసరి బంగారు పతకాన్ని సాధించిన సందర్భంగా మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బల్కంపేట బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొత్తపల్లి శంకర్‌గౌడ్, కోశాధికారి రజినీకాంత్‌గౌడ్, మల్లయోధులు ధన, పవన్, సందీప్‌యాదవ్ తదితరులు పాల్గొని విజేత విజయ్‌కుమార్‌ను అభినందించారు. *- అమీర్‌పేట్, ఫిబ్రవరి 27*

భవిష్యత్‌పై కార్యాచరణ

సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్/మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 27: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగే విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని మంగళవారం బీజేపీ నాయకులు పిలుపు నిచ్చారు. సీతాఫల్ మండి డివిజన్ పరిధి వారాసిగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితిలో లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, మేకల సారంగపాణి, కందాడి నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

కంటోన్మెంట్ పికెట్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద మంగళవారం ఆ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ ఆధ్వర్యంలో విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షులు బి. శ్యాంసుందర్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం శ్యాంసుందర్, శ్రీ గణేష్ మాట్లాడుతూ.. ఈ నెల 29న కంటోన్మెంట్ నియోజకవర్గానికి వస్తున్న బస్సు యాత్ర (విజయ సంకల్పయాత్ర)ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ విజయ్ ఆనంద్, కో కన్వీనర్ సతీష్, పార్లమెంట్ కన్వీనర్ నర్సింగ్‌రావు, నాయకులు పరశురాం, బీఎన్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొఫెసర్ కోదండరాం

మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

ముషీరాబాద్, ఫిబ్రవరి 27: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. చాలా కాలంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం వాయిదా పడుతుందని, ఈ విషయంపై త్వరలోనే సీఎంను కలిసి చర్చించనున్నట్లు తెలిపారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరాం మాట్లాడుతూ.. కాంగ్రెస్ జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకంగా నిలిచిందన్నారు. హైదరాబాద్ జిల్లా సహకార శాఖ అధికారి డి.రమాదేవి మాట్లాడుతూ.. తమ శాఖ తరపున జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. సొసైటీ బైలా ప్రకారం నియమ నిబంధనలు అమలు చేస్తూ చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జన సమితి నగర అధ్యక్షుడు ఎం.నర్సయ్య, ప్రతినిధులు పులిపలుపుల ఆనందం, బొల్లం శ్రీనివాస్, రాంచందర్, రామారావు, భాస్కర్‌రెడ్డి, వీరేశం, షోయబుల్లా ఖాన్, బీఆర్‌కె మూర్తి పాల్గొన్నారు.

ఇండ్లు కోల్పోయిన బాధితులకు అండగా ఉంటాం

చిక్కడపల్లి: ఇండ్లు కోల్పోయిన దళిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం అన్నారు. గాంధీనగర్ డివిజన్ శ్రీ స్వామి వివేకానందనగర్ బస్తీలో గత నెల 29వ తేదీన అధికారులు అక్రమంగా 21 ఇండ్లు కూల్చడంతో.. బాధితులు చేప్పటిన నిరసన దీక్ష 29వ రోజుకు చేరుకుంది. మంగళవారం బాధితులు చేప్పటిన నిరసన దీక్షకు కోదండరాం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా హైదరాబాద్ కలెక్టర్‌తో సమీక్షించి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారంతో పాటు పునరావాసం కల్పించే విధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం. నర్సయ్య, మెరుగు శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ కన్వీనర్ రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

న్యాక్‌లో మార్పులను గమనించాలి

న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్

కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 27: విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో న్యాక్ పాత్ర ఎంతో ఉంటుందని న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ అన్నారు. న్యాక్ గుర్తింపులో వస్తున్న మార్పులను అధ్యాపకులు గమనించాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా న్యాక్ గుర్తింపుపై రెండు రోజుల జాతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఓయూ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వీఎస్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్పులకు అనుగుణంగా మెరుగు కావాల్సిన విభాగాలపై దృష్టిసారించాలని సూచించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి మాట్లాడుతూ.. తెలంగాణలో సగటున 2.25 నుంచి 2.5 లక్షల మంది విద్యార్థులు యూజీ కోర్సులను అభ్యసిస్తున్నారన్నారు. వారిలో 25 వేల మంది మాత్రమే ప్రభుత్వ ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాలలో సాంప్రదాయ పీజీ కోర్సుల్లో చేరుతున్నారన్నారు. సాంప్రదాయ పీజీ కోర్సుల్లో చేరే 76 శాతం మంది మహిళా విద్యార్థినుల అవసరాలు తీర్చేందుకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ శిరీష, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ జి. మల్లేశం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. విజయభాస్కర్‌రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, హెడ్‌లు, డీన్‌లు, అనుబంధ కళాశాలల ప్రతినిధులు హాజరయ్యారు.

గణపతి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు

సికింద్రాబాద్ గణపతి ఆలయంలో నిర్వహించిన పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ. పాల్గొన్న ఈఓ వినోద్, పాలక మండలి సభ్యులు

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 27: సికింద్రాబాద్ గణపతి ఆలయంలో మంగళవారం ఆలయ పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఆలయ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పాలక మండలి సమావేశంలో మహాశివరాత్రి వేడుకలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ..సికింద్రాబాద్ గణపతి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మార్చి 7 నుంచి 9 వరకు శ్రీ ఉమామహేశ్వరీ సహిత శ్రీ ఉమా మహేశ్వర స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 8న ఉదయం 6 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 9 గంటలకు గణపతి సహిత అఘోర పాశుపథ రుద్రహోమం, ఒంటి గంటకు ఏకాదశ రుద్రాభిషేకం, 4 గంటలకు కుబేర పాశుపత రుద్రహోమం (ధన సమృద్ధి), సాయంత్రం 7 గంటలకు శ్రీ ఉమా మహేశ్వరీ సహిత ఉమా మహేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వినోద్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడితే సహించం

మాట్లాడుతున్న బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 27 : ఉపాధ్యాయ సంఘం పేరుతో ఎవరైనా వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ.. బీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చలామణి అవుతూ రవీందర్ క్యాలెండర్లు, డైరీలు తీస్తున్నామంటూ వివిధ పాఠశాలల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. యాదగిరి కూడా రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నాడని వారితో తమ సంఘానికి సంబంధం లేదన్నారు. అలాగే మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలిగా ఉన్న కవిత సంఘం నియమాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, ఆమె సభ్యత్వాన్ని శాశ్వతంగా తొలగిస్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా కమిటీని కూడా రద్దు చేశామన్నారు. ఎవరైనా బీటీఎఫ్ పేరుతో వసూళ్లకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు చిలుకాదేవ శంకర్, సలహాదారులు బొల్లారం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

నారాయణగూడలోని క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 27: అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకాన్ని పేదల కోసం ప్రవేశ పెట్టారని తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు ఇందిరానగర్ బస్తీకి చెందిన లలిత, పప్పిబాయిలకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం నారాయణ గూడలోని క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ వీఆర్వో విష్ణు, బీఆర్ఎస్ నాయకులు జి.రామన్ గౌడ్, మహేశ్, అభిషేక్ పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

బొల్లారం రాష్ట్రపతి నిలయంలో సైన్స్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థులు చేపట్టిన సాంకేతికత ప్రదర్శనలు

బొల్లారం, ఫిబ్రవరి 27:జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో రెండో రోజు విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంకేతికత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా నగరంలో వివిధ పాఠశాలలు,కళాశాలలకు చెందిన సుమారు 2000 మంది విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలను వీక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయం అధికారులు,విద్యాసంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.